www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 19 ఫిబ్రవరి 2024

5

అన్నమయ్య



నేడు యథావిధిగా 'జగనన్నకు చెబుదాం'

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి 'జగనన్నకు చెబుదాం - స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కోవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

కనుమరుగవుతున్న కంది పంట

- అమ్మకాలు అంతంత మాత్రమే

- వర్షాభావంతో తగ్గిన సాగు - ఆసక్తి చూపని రైతులు



ప్రజాశక్తి - రాయచోటి

గతంలో గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు వేరుశనగ పంటలతోపాటు కందిని సాగు చేసేవారు. కానీ నేడు కంది పంట సాగు చేసేవారి సంఖ్య అన్నమయ్య జిల్లాలో గణనీయంగా తగ్గిపోతుంది. ముఖ్యంగా వర్షాభావం వల్ల పంటలు వేసే రైతుల సంఖ్యా గణనీయంగా తగ్గింది. దీనికి తోడు ఇప్పటికే వ్యవసాయం చేసే రైతులు కాయ కష్టం చేసి పంటల సాగు చేస్తున్నప్పటికీ అకాల వర్షాలు రావడంతో పంట చేతికి సమయంలో దెబ్బతినడంతో రైతులు భారీగా నష్టాల పాలై అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. నాణ్యమైన విత్తనాలు లేకపోవడం, కల్తీ మందులు వాడటం వల్ల కూడా పంట దిగుబడి తగ్గుతున్నాయి. గతంలో రైతులు వర్షాలు లేకపోయినప్పటికీ సాగు చేసి ఫిబ్రవరి నెల చివరికి అంత పంట దిగుబడి చేసి కోత కోసేవారు. నేడు కంది పంట సాగు చేయాలంటే ఏ రైతూ ముందుకు రావడం లేదు. ఇప్పుడు ఎక్కువ శాతం అరటి, బొప్పాయి, తమలపాకు, టమోటా, మామిడి వంటి పంటలపైనే రైతులు ఎక్కువ శ్రద్ధ చూపుతుంది. రాబోయే రోజుల్లో కంది పంట వేసే రైతులు కనపడే పరిస్థితి లేకుండా పోయింది. ఏది ఏమైనప్పటికీ కందులు చాలా బలవర్ధమైన ఆహారం అలాంటి పంటను సాగు చేయకపోవడం, ఎక్కడో సాగుచేసిన కందులను సొమ్ము చేసుకుంటున్నారు. ఇక రాబోయే రోజుల్లో పిల్లలకు కందులు అంటే బొమ్మలు చూపించి ఇలా ఉంటాయి అంటూ చెప్పాల్సిన పరిస్థితి నెలకొంటుంది. చిరుధాన్య పంటలు సాగు కూడా గణనీయంగా తగ్గింది. గతంలో సజ్జలు, రాగులు, కొర్రలు, జొన్నలు, అనుములు ఇలాంటివి చిరుధాన్యాలు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలను రైతులు సాగు చేసేవారు. నేడు ఈ చిరుధాన్యాలు కూడా అంతంత మాత్రమే సాగు చేస్తున్నారు. జిల్లాలో ఖరీఫ్ లో 363 హెక్టార్లలో సాగు చిన్నమండెం 32, సంబేపల్లి 121, రాయచోటి 141, గాలివీడు 338, లక్కిరెడ్డిపల్లి 265, రామాపురం 277, వీరబల్లి 115, మొలకల చెరువు 276, తంబళ్లపల్లె 119, కురబలకోట 135, పెద్దతిప్ప సముద్రం 369, కొత్తకోట 179, మదనపల్లె 137, నిమ్మనపల్లి 131, రామసముద్రం 147, కంభం వారి పల్లి 150, పీలేరు 101, పెద్దమండెం 152, గుర్రముకొండ 69, కలకడ 70, కలికిరి 148, వాయల్పాడు 134 హెక్టార్లలో సాగు చేశారు. అయితే రబీలో మాత్రం జిల్లాలో కంది పంట ఎక్కడ సాగు చేయలేదని అధికారులు చెబుతున్నారు.



బీళ్లుగా మారిన భూమి

పెట్టుబడి ఎక్కువ..



కంది, ఇతర చిరుధాన్యాలు పంటలు సాగు చేయాలంటే దుక్కి చేయడం, ఎరువులు, మందులు, కూలీల ఖర్చులు ఎక్కువ అవుతున్నాయి. వర్షాలు సకాలంలో కురవడం లేదు. ప్రభుత్వం కూడా వీటికి నష్ట పరిహారం ఇవ్వడం లేదు. ఈ పంటలు సాగు చేయాలంటే ఇబ్బందిగా ఉంది.

-పామయ్య రైతు, పి.ఎన్.కాలవ, సుండుపల్లి మండలం.

కందిని సాగుచేయడం లేదు



కందిని ఖరీఫ్‌లో మాత్రమే రైతులు సాగు చేస్తున్నారు. వర్షాలు సకాలంలో కురవకపోవడం వల్ల రబీలో కంది పంటను రైతులు సాగు చేయడం లేదు. రైతులకు గ్రామీణ ప్రాంతాలలో పలు అవగాహన సదస్సును కూడా నిర్వహిస్తున్నాం.

- చంద్ర నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి, రాయచోటి, అన్నమయ్య జిల్లా

సిఎం సభకు ఆర్‌టిసి బస్సులు

ఇబ్బందుల్లో ప్రయాణికులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

బస్టాండ్‌లో ప్రయాణికులు ఫుల్.. బస్సులు మాత్రం నిల్.. అన్నటుంది రాయచోటి బస్టాండ్. ముఖ్యమంత్రి సభ జరిగితే ప్రయాణికులు భయపడుతున్నారు. ఎక్కడ సభ జరిగినా ఆర్‌టిసి బస్సులు తరలిస్తుండడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలో బహిరంగ సిద్ధం సభకు ఆ జిల్లాలో జన సమీకరణ కోసం రాయచోటి డిపో నుంచి 80 బస్సులను తరలించారు. దీంతో రాయచోటి చుట్టుపక్క ప్రాంత ప్రయాణికులు ఇక్కట్లను ఎదుర్కోవాల్సి వచ్చింది. సిద్ధం సభలో ముఖ్యమంత్రి మ్యానిఫెస్టోను ప్రకటిస్తారని రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన సందేశాన్ని ఇస్తారని, ఎన్నికల పోరాటానికి మేము సంసిద్ధం అనేందుకు పార్టీ క్యాడర్ తో పాటు ప్రజలకు వాస్తవాలు తెలియ చెప్పేందుకుఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా బహిరంగ సిద్ధం సభ ఏర్పాటు చేయగా.. ఇందుకోసం అన్నమయ్య జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నుంచి జనసమీకరణ చేశారు. ఇందుకోసం రాయచోటి, పీలేరు, మదనపల్లి, రాజంపేట, తాంబళ్ల పల్లి వివిధ ప్రాంతాల నుంచి బస్సులను తీసుకెళ్లారు. పెద్ద సంఖ్యలో బస్సులు రద్దు కావడంతో ప్రయాణికులు ఇబ్బందులుఎ దుర్కొంటున్నారు. సిఎం అనంతపురం రాక సందర్భంగా బస్సుల రద్దు విషయాన్ని తెలియజేస్తూ నోటీసు బోర్డు లేకపోవడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రయివేట్ వాహనాల్లో అధిక వసూళ్లు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చుట్టుపక్క ప్రాంతాల నుండి అవసరాల నిమిత్తం వేలమంది ప్రయాణికులు వస్తూపోతూ ఉంటారు. ఆదివారం కావడంతో ప్రయాణికుల రద్దీ మరింత పెరిగింది. తాజాగా బస్సులు అందుబాటులో లేకపోవటంతో వీరి ప్రయాణానికి ఇబ్బంది కల్గింది. బస్టాండ్‌లో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుంది. నిత్యం పట్టణాలకు, ఇతర ప్రాంతాలకు వెళ్లే వారిది కూడా ఇదే పరిస్థితి. తప్పని పరిస్థితిలో ప్రయివేట్ వాహనాల్లో, ఆటోలలో అధిక చార్జీలు చెల్లించి ప్రయాణం చేస్తున్నారు. ఆటోలు పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్తుండడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. మరోవైపు రాయచోటి డిపోలో ఆంధ్ర బస్సులు లేకపోవడంతో కర్ణాటక బస్సులే దిక్కయి 2 గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. బస్టాండ్లలో రద్దీ ఎక్కువగా ఉంది. కర్ణాటక బస్సులే దిక్కయ్యాయి. ప్రయివేట్ వాహనాలు, ఆటోల వారు ఎక్కువ చార్జీలు వసూలు చేస్తున్నారు. అందులోనూ పరిమితికి మించి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి సభ అనంతపురం జిల్లా రాప్తాడులో జరుగుతుండటంతో జనాన్ని తరలించేందుకు ఆర్‌టిసి బస్సులను ఎలా వాడుకుంటారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి ఆర్టీసీ బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాయచోటి పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లాల్సిన బస్సు సర్వీసులు రద్దు కావటంతో కనీసం సమాచారం లేకుండా ఎలా రద్దు చేస్తారని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. పలు ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సులు లేక ప్రయాణికులు గంటల తరబడి బస్టాండ్‌లో వేచి చూశారు. ఉదయం నుంచి ఆస్పత్రులకు వెళ్లే రోగులు, వృద్ధులు, వికలాంగులు అవస్థలు పడ్డారు.



బస్సులు లేక ఖాళీగా ఉన్న ప్లాట్‌ఫామ్



బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

'గంగనపల్లి'కి కవి శిఖామణి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేటకు చెందిన తెలుగు పండితులు, కవి, తెలుగు భాషా సంరక్షణ సమితి జిల్లా సహాయ కార్యదర్శి గంగనపల్లి వెంకటరమణ ఆదివారం హైదరాబాదు నగరంలోని రవీంద్ర భారతిలో కవి శిఖామణి బిరుదును అందుకున్నారు. కరీంనగర్‌కు చెందిన మహతీ సాహితీ కవి సంగమం వారి ఆధ్వర్యంలో నాలుగు నెలలుగా రోజుకొక్క కవిత చొప్పున నూరు కవితలు రచించిన కవులకు ఈ బిరుదులను ప్రదానం చేశారు. ఇందులో గంగనపల్లి వెంకటరమణ పాల్గొని నూరు పద్య కవితలను రచించారు. ఈ నేపథ్యంలో మహతీ సాహితీ కవి సంగమం అధ్యక్షులు డాక్టర్ అడిగొప్పుల సదయ్య ఆధ్వర్యంలో ముందస్తు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు డాక్టర్ నందిని సిధారెడ్డి, తొలి కార్యదర్శి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ సంచాలక సలహాదారులు నాళేశ్వరం శంకరం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్వర్ణ నంది అవార్డు గ్రహీత సాధనాల వెంకటస్వామి నాయుడు, కవి సంగమం ప్రధాన కార్యదర్శి పొర్ల వేణుగోపాలరావు, ప్రముఖ పద్య కవి కుందారపు గురుమూర్తి తదితర ప్రముఖులు అతిథులుగా విచ్చేసి గంగనపల్లి వెంకటరమణను శాలువా, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలతో సత్కరించి మహతీ సాహితీ కవి శిఖామణి బిరుదును అందజేశారు. సందర్భంగా నందలూరు నాగిరెడ్డిపల్లె పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, పలువురుసాహితీ మిత్రులు, శ్రేయోభిలాషులు గంగనపల్లి వెంకటరమణకు అభినందనలు తెలిపారు.



గంగనపల్లి వెంకటరమణను కవి శిఖామణి బిరుదుతో సత్కరిస్తున్న ప్రముఖులు

ఆలయాల అభివృద్ధికి కృషి

జిల్లా దేవాదాయశాఖ అధికారి సి.విశ్వనాథ్



ముఖా ముఖి..

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ప్రజలకు, యాత్రికులకు అందుబాటులో ఉంటూ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా దేవాదాయ శాఖ అధికారి సి. విశ్వనాథ్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో దేవాలయాల అభివృద్ధిని ఎలా చేయాలో, నూతన ఆలయాలను ఎన్ని నిర్మిస్తున్నారో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

అన్నమయ్య జిల్లాలో ఆలయాలు వివరాలు తెలపండి?

అన్నమయ్య జిల్లాలో మొత్తం 1655 ఆలయాలున్నాయి. 30 సత్రాలున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఆరుగురు ఆలయ ఇఒలు ఉన్నారు. ఆలయ ఇందులో గ్రేడ్ - 1 ఒకరు, గ్రేడ్-2 ముగ్గురు, గ్రేడ్-3 ఇద్దరు ఇఒలున్నారు. శ్రీ రెడ్డమ్మ దేవస్థానం చెర్లోపల్లి గ్రామం, గుర్రంకొండ మండలం, శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం రాయచోటి టౌన్, శ్రీ గంగమ్మ దేవత దేవస్థానం అనంతపురం గ్రామం లక్కిరెడ్డిపల్లి మండలం, శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం మదనపల్లె టౌన్, సుండుపల్లె, రాజంపేట, వాయల్పాడు, బి .కొత్తకోట గ్రూప్ ఆలయాలున్నాయి.

దేవాదాయ శాఖ భూముల వివరాలు తెలపండి?

జిల్లా వ్యాప్తంగా 9761.3 సెంట్లు ఉన్నాయి. బి. కొత్తకొట 380.95, చిన్నమండెం445.16, చిట్వేల్ 187.17, గాలివీడు 686.63, గురంకొండ 350.6, కలకడ 182.64, కలికిరి 315.93, కె.వి.పల్లి 218.52, రైల్వే కోడూర్ 534.23, కురబలకోట 417.91, లక్కిరెడ్డిపల్లి 205.54, మదనపల్లి 233.39, మొలకలచెరువు 270.58, నందలూరు 50.93, నిమ్మనపల్లి 132.17, ఓబులవారిపల్లి 185.85, పెద్దమండ్యం 395.58, పెద్దతిప్పసముద్రం 1194.59, పెనగలూరు 195.2, పీలేరు 220.1, పుల్లంపేట 190.22, రాజంపేట 262.83, రామాపురం 321.35, రామసముద్రం 608.24, రాయచోటి 196.53, సంబేపల్లి 253.19, సుండుపల్లి 265.88, తంబళ్లపల్లి 471.6,వాయల్పాడు 208.67, వీరబల్లి 179.12 సెంట్లు ఉన్నాయి.

జిల్లాలో కొత్తగా ఆలయాల ఏమైనా మంజూరయ్యాయా?

టిటిడి శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఎస్‌సి, ఎస్‌టి, బిసి కాలనీల్లో పది లక్షల స్కీముల కింద అన్నమయ్య జిల్లాలో 181 వివిధ ఆలయాల నిర్మాణాలు జరగుతున్నాయి.

ఆలయాల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

2018 -19 నుంచి 2023-24 వరకు శిథిలావస్థలో ఉన్న ఆలయాల జీర్ణోద్ధరణ కోసం ప్రభుత్వం ఆర్థిక సాయం చేయడానికి సర్వశ్రేయోనిధి అనే స్కీమును ప్రవేశపెట్టి తద్వారా నిధులను మంజూరు చేసింది. జిల్లాలో మొత్తం రూ.22,11,50 కోట నిధులు మంజూరయ్యాయి. పథకం కింద అన్నమయ్య జిల్లాలోని రెండు ఆలయాలను నిర్మించడానికి టిటిడి ద్వారా రూ 38,00,000/- నిధులు మంజూరయ్యాయి.

ప్రజలకు సలహాలు, సూచనలు ఏమైనా ఇవ్వాలనుకుంటున్నారా?

ప్రస్తుతం ఆలయ భూములకు కౌలు మొత్తం చాలా తక్కువగా వస్తోంది. ఇతర భూములతో పోల్చుకొని దేవాలయ భూములకు కూడా కౌలు మొత్తం పెంచాల్సిన అవసరముంది. ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఆలయాలకు సంబంధించి ఎలాంటి సమస్య కానీ, ఆక్రమణదారుల గురించి కానీ సమస్యలుంటే రాయచోటిలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయ పక్కన ఉన్నటువంటి జిల్లా దేవదాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలి.

టిడిపిలో బిసిలకు పెద్దపీట

జయహో బిసి సమావేశంలో 'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

తెలుగుదేశం పార్టీ బిసిలకు పెద్దపీట వేసిందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చంగల్ రాయుడు అన్నారు. నారా చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు ఆదివారం రాజంపేట మండలంలోని బిసి కుటుంబసభ్యులతో న్యూ ఆంధ్ర కల్యాణ మండపంలో జయహోబిసి కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి బిసి నాయకులు, ప్రజలను శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో బత్యాల మాట్లాడుతూ బిసిపజలు శ్రమజీవులని, చారిత్రకంగా గాని, వారసత్వపరంగా గాని ఆర్థిక వనరులు లేక కుల వ్యవస్థ వల్ల వారు అణచివేయబడ్డారని అన్నారు. ప్రజల కోసం పోరాడిన జ్యోతిరావు పూలే స్ఫూర్తితో తమతోనే ప్రగతి సాధ్యమని నమ్మి బిసిఎదుగుదలే పార్టీ భావజాలంగా నాటి ఎన్టీఆర్ నుంచి నేటి చంద్రబాబు వరకు గత 40 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీ కృషి చేస్తోందని తెలిపారు. 'భవిష్యత్తుకు భరోసా' లో భాగంగా దేశంలోనే మొదటిసారిగా బిసిలకు రక్షణ చట్టం' తెచ్చి వారికి అన్ని విధాలుగా అండగా నిలవాలని తెలుగుదేశం పార్టీ నిశ్చయించుకుందని అన్నారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక బిసిను అన్ని విధాలుగా అణచివేతకు గురి చేశారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో 25 ఏళ్లుగా 34 శాతంగా ఉన్న బిసి రిజర్వేషన్‌ను 24 శాతానికి తగ్గించారని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వంలో 75 మందికి పైగా బిసి నాయకులు హత్య చేయబడ్డారని, 2540 మంది దాడులకు గురయ్యారని, 26,000 మంది బిసిలపై అక్రమ కేసులు బనాయించారని అన్నారు. టిడిపి హయంలో బిసి పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఆర్‌టిఆర్ విదేశీ విద్యాదరణ, కులవృత్తులు వారికి 90 శాతం సబ్సిడీతో పనిముట్లు పంపిణీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు, చంద్రన్న పెళ్లి కానుక, తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్, చంద్రన్న బీమా వంటి పథకాలను అందజేసి బీసీలకు వెన్నుదన్నుగా నిలిచారని గుర్తు చేశారు. మత్స్యకార, చేనేత, బోయ-వాల్మీకి, నాయి బ్రాహ్మణ, రజక, గీత కులాలు, కురుబ, యాదవ వంటి కులవృత్తుల వారికి అనేక పథకాలు ద్వారా చేయూతనందించడం జరిగిందని వివరించారు. రానున్న ఎన్నికలలో బిసిలు ఐక్యమై వైసిపిని బంగాళాఖాతంలో కలిపి బిసిల ప్రగతికి, తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముందుగా నందమూరి తారకరత్న వర్ధంతి సందర్భంగా ఐదు నిమిషాల పాటు మౌనం పాటించారు. సమావేశానికి బిసి సెల్ రాష్ట్ర కమిటీ నుంచి హాజరైన వారిని బత్యాలతో పాటు తెలుగు యువత అసెంబ్లీ ఆర్గనైజింగ్ కార్యదర్శి గగ్గుటూరి హుమయున్ శాలువాలు వేసి పుష్ప గుచ్చాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, బిసి సెల్ పార్లమెంట్ అధ్యక్షులు పిల్లింగారి సురేంద్ర యాదవ్, అసెంబ్లీ అధ్యక్షులు మీనిగ వెంకటరమణ, బిసి సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ గురిగింజకుంట శివప్రసాద్ నాయుడు, తెలుగుదేశం పార్టీ బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కమతం నాగరాజు యాదవ్, తాటి సుబ్బరాయుడు, అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, బిసి సెల్ మాజీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఇడిమడకల కుమార్, మాజీ కౌన్సిలర్ ముమ్మడి చిన్నయ్య, పార్లమెంట్ అధికార ప్రతినిధి అద్దేపల్లి ప్రతాప్ రాజు, రాజంపేట పట్టణ పార్టీ అధ్యక్షులు దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, ఎస్‌సి సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మందా శ్రీనివాసులు, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు మన్నూరు పీరు సాహెబ్, ప్రధాన కార్యదర్శి ఎస్.కె కరీం, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీరాములు, మండలం లోని బిసి నాయకులు, కార్యకర్తలు, పదాధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



బత్యాల చంగల్‌రాయుడును సన్మానిస్తున్న హుమయున్

3న వాల్మీకుల రౌండ్ టేబుల్ సమావేశం

మదనపల్లి : జయహో వాల్మీకి రాష్ట్రస్థాయి రౌండ్ టేబుల్ సమావేశం మార్చి 3న నిర్వహించనున్నట్లు వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షులు పులి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం సమావేశానికి సంబంధించిన కరపత్రాలను, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వాల్మీకుల ఓటును అస్త్రంగా మలిచి ఎస్‌టి పునరుద్ధరణ సాధించడం ఎలా అనే అంశాన్ని తెలియజేయడం కోసం ఆంధ్రప్రదేశ్ లోని అన్ని కుల సంఘ నాయకులు, రాజకీయ పార్టీలలో ఉన్న వాల్మీకి నాయకులు, వాల్మీకుల శ్రేయస్సు కోసం కృషి చేస్తున్న వాల్మీకి పెద్దలు ఒకే వేదికను అలంకరించి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామన్నారు. ఎపిలోని ప్రతి ఒక్క వాల్మీకి పాల్గొని పెద్దలు సూచించిన మార్గంలో నడవాలని తెలియజేశారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ నాయకులు సద్దల జయసింహ, వలసల మంజునాథ్, అరవనిర్మలమ్మ, పార్వతమ్మ పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండయ్య

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండయ్య అన్నారు. ఆదివారం అయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మార్చి 3న పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరికీ ఏర్పాటు చేసిన పోలియో చుక్కల కేంద్రాలలో ఉదయం 7.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు పోలియో చుక్కలు వేస్తారన్నారు. ఇప్పటికే కార్యక్రమంలో పాల్గొనే 4961 మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చామని చెప్పారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా మొత్తం ఐదేళ్లలోపు పిల్లలు 193946 మందిని నమోదు చేశారని తెలిపారు. వారందరికీ పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకుని పని చేయాలని సిబ్బందికి సూచించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1602 పోలియో చుక్కల కేంద్రాలు ,207 రూట్ లను ఏర్పాటు చేశామని, బస్టాండ్, రైల్వేస్టేషన్‌లలో 45 పోలియో చుక్కల కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఇటుక బట్టీలు దగ్గర, భవనాల నిర్మాణం జరిగే చోట, మురికివాడల్లో నివసించే ప్రాంతాల్లో, ఫ్లై ఓవర్ల కింద నివసించే పేదల పిల్లలకు రహదారి పనులు జరిగే చోట, సంచార జాతుల వారు, చేపలు పట్టు వారు, సంతలలో, వ్యవసాయ పొలాల్లో పనులు చేసుకునే చోట, రాళ్లు, బండలు కొట్టే చోట నివాసం ఉండే ప్రాంతాలను 181 గుర్తించామని చెప్పారు. వారి పిల్లలకు పోలియో చుక్కలు వేయడానికి ప్రత్యేక బృందాలను గుర్తించామని తెలిపారు. ఒకవేళ మార్చి 3న పోలియో చుక్కలు వేసుకోని పిల్లలకు 4,5 తేదీలలో వేస్తారని వివరించారు. బూత్ పరిధిలోని నలుగురు సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి ప్రతీ ఇంటికి వెళ్లి విచారించి పోలియో చుక్కలు వేస్తారన్నారు. పోలియో చుక్కలు వేయించుకున్న పిల్లలకు ఎడమ చేతి చిటికెన వేల కు జెన్షన్ వైలెట్‌తో గుర్తు వే యాలని అన్నారు. అన్ని అనుబంధ శాఖలు, విద్యా శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్ ,విద్యుత్, రెవెన్యూ శాఖల అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు ఈ జాతీయ సామూహిక పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొని పోలియో రహిత సమాజ స్థాపన లక్ష్యాన్ని సాధించడంలో భాగస్వామ్యమై విజయం సాధిద్దాం అని అన్నారు. సమావేశంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ జి.ఉషశ్రీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ కొండయ్య

'అబాకస్'లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

చెన్నైలో సిఎంఎస్ ఆధ్వర్యంలో జనవరి 28న నిర్వహించిన జాతీయస్థాయి అబాకస్ అండ్ మెంటల్ అర్థమెటిక్ పోటీలకు రాయచోటి మ్యాక్స్ అబాకస్ నుంచి 9 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారని బ్రాంచ్ నిర్వాహకులు శాంతి పేర్కొన్నారు. ట్రోఫీలు సాధించిన విద్యార్థులను ఆదివారం ఎన్‌జిఒ హోమ్‌లో అభినందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిన్నా సేవా సంస్థ అధ్యక్షులు షరీఫ్ హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా ట్రోఫీలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాయచోటి మాక్స్ అబాకస్ బ్రాంచ్ నిర్వాహకులు మాట్లాడుతూ అబాకస్ ద్వారా గణితంలో వేగం, కచ్చితత్వం పొందవచ్చని అబాకస్ ద్వారా పిల్లలలో కలిగే గణిత నైపుణ్యాలు ప్రయోజనాలను చక్కగా తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు. అబాకస్ పోటీల్లో బ్రాంచ్ లెవెల్ లో నిర్వహించిన 'ఫైండ్ ద ఛాంపియన్' కాంపిటీషన్ లో ఎస్. తన్వీర్ ఛాంపియన్ గా నిలిచారని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు



కోలాటం బృందానికి ఆర్థిక సాయం అందిస్తున్న వరలక్ష్మి

కోలాటం బృందానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

మండల పరిధిలోని బోమ్మవరం గ్రామం చెందిన కోలాటం కళా బృందానికి ముక్కా రుపానంద రెడ్డి ఫౌండేషన్ అధినేత సతీమణి ముక్కా వరలక్ష్మీ రూ.30వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముక్కా రుపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా ఎందరికో నీడనిచ్చి అండగా నిలిచిన మన సాంప్రదాయ కళలు అంతరించిపోకుంటు ఉండేందుకు తన వంతుగా ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మనేమ్మ సుబ్బ రాజు, సింగమాల, రఘునాథ్‌రెడ్డి, సింగమాల, విశ్వనాథ్‌రెడ్డి , నారపరెడ్డిరాజరెడ్డి, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, ముక్కావారిపల్లి సర్పంచ్ ఆరవ శ్రీధర్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎపిటిఎఫ్ నాయకులు

సమస్యలపై ఉద్యమబాట తప్పదు

పజాశక్తి-కలికిరి

ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి ఉద్యమ బాట తప్పదని ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్‌యాదవ్ అన్నారు. ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం కలికిరి పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మొదటి నుండి కూడా ఉపాధ్యాయులు, ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా, వ్యతిరేక ధోరణి అవలంభిస్తోందని, ప్రధా నంగా ఆర్థిక పరమైన నష్టాన్ని కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. డిఎలలు, పిఆర్‌సి, బకాయిలు పాలనా కాలమంతా పెండింగ్‌లో ఉంచి నష్టం చేకూరుస్తున్నారని అన్నారు. సిపిఎస్ వారంలో రద్దు చేస్తామని ఒపిస్ పునరుద్ధరిస్తామని ఎన్నికల ముందు పదేపదే హామీఇచ్చి ఇపుడు మాటతప్పారని, తరువాత ఉద్యోగులకు అంగీకారం కాని జిపిఎస్‌ను తెచ్చారని విమర్శించారు. ఉపాధ్యాయులు కు బోధనేతర పనులను అప్పగిస్తూ పనిఒత్తిడికి గురిచేస్తూ, పరోక్షంగా విధ్యార్థులుకు నష్టం చేస్తున్నారని అన్నారు. ఇలాంటి విషయాలపై పలుమార్లు సంఘాలు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి ప్రతిపాదించినా స్పందనలేకాపోగా చర్చల పేరుతో కాలయాపన చేయడం, కొన్ని హామీలు, జిఒలు ఇచ్చినా కార్యచరణలో మాత్రం అమలుకాని పరిస్థితి నెలకొందని అన్నారు. నాయకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉత్తుత్తి చర్చలు, ప్రయోజనం కాని చర్చలుగా ఉపాధ్యాయ, ఉద్యోగులలో అప నమ్మకం పాదుకొల్పేలా చర్చల తీరు జరిగి ఉద్యోగులు నిరాశకు గురౌతు న్నారన్నారని అన్నారు.కార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు శంకర, సంషుద్దీన్, సహదేవ, గంగ రాజు, మురళీ, జనార్దన్, శ్రీనివాసులు, నీలకంఠ, నిరంజన్, రెడ్డిమోహన్, వెంకట్రమణలు పాల్గొన్నారు.

జిసిసి కమిటీ అడ్వైజర్లుగా నరసారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు



వెంకట నరసారెడ్డి



మహేశ్వర్‌రెడ్డి

ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ ఎన్ఆర్ఐ విభాగం జిసిసి కమిటి వైసిపి అడ్వైజర్‌లుగా (గల్ఫ్ కౌన్సిల్ అఫ్ కంట్రీస్)గా రైల్వే కోడూరు నియోజకవర్గం నగరిపాడుకు చెందిన మూరి వెంకటనరసారెడ్డి, వెంకటరెడ్డిపల్లెకు చెందిన నాయని మహేశ్వర్ రెడ్డిలను నియమిం చారని వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలో బాగా పనిచేసిన వారికి, వైఎస్ కుటుంబాన్ని నమ్ముకొన్న వారికి గుర్తింపు వస్తుందనేదానికి తామే నిదర్శనమని అన్నారు. కువైట్‌లో మృతి చెందిన కోడూరు ప్రాంత పేద కుటుంబాలకు గతంలో ఆర్థిక సాయం కూడా అందించామని అన్నారు. కరోనా సమయంలో కువైట్‌లో తెలుగు వారికి అండగానిలిచామని అన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులన్నా తాము న్నామంటూ సమస్యలను భారత రాయబార కార్యాలయం అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఇకపై కూడా గల్ఫ్‌లో వున్న తెలుగు వారికి అండగా ఉంటామని తెలిపారు. తమకు ఈ పదవులు రావడానికి సహకరించిన ఎంపీ విజయ సాయిరెడ్డికి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులుకు, ఎన్ఆర్ఐ కన్వీనర్ మేడపాటి వెంకట్‌కు, గల్ఫ్ కన్వీనర్ బిహెచ్. ఇలియాస్ కు, కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మళ్ళీ వైసిపి అధికారంలోకి వచ్చేందుకు, వైఎస్.జగన్‌మోహనరెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

18 మందికి కంటి శస్త్ర చికిత్సలు

ప్రజాశక్తి-రాయచోటి

మండల పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలో గల లయన్స్ కంటి ఆస్పత్రిలో ఆదివారం జరిగిన కంటివైద్య శిబిరంలో 18 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంతో పాటు రాజంపేట, రైల్వే కోడూరు, పీలేరు, యర్రావారి పాలెం, కేవీపల్లి, కలకడ, కలికిరి ,గుర్రంకొండ, పెద్దమండెం, కదిరి, ఎన్.పి.కుంట,చక్రాయపేట తదితర ప్రాంతాల నుండి వచ్చిన 50 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వైద్యులు అందులో 18 మంది కంటి రోగులకు ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 30 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంటి ఆస్పత్రి చైర్మన్ వైవిఆర్, స్వరూప గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, లయన్ జయరామిరెడ్డి, కంటి వైద్యులు మహాలక్ష్మి, భార్గవి,ఆప్తమాలిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆదివారం 1986-87 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పరిచయాలు చేసుకొని 35 సంవత్సరాల క్రితం ఈ పాఠశాలలో చదువుకున్న రోజుల్లో ఉన్న తీపి జ్ఞాపకాలను నెమరవే సుకు న్నారు. పూర్వవిద్యార్థులు శ్రీనివాసరాజు, గౌస్మొద్దీన్, గంగాధర , రామకృష్ణ హెగ్డే ఆధ్వర్యంలో అందరూ కలుసుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వ హించి నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తమకు చదువుచెప్పిన విశ్రాంత ప్రధా నోపాధ్యాయుడు మల్లన్న, ఉపాధ్యాయులునరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మెహిదీన్‌లను పూర్వ విద్యార్థులు దుశ్శాలువా, పూల మాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



సన్మానం పొందిన రిటైర్డ్ ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

సిరులు కురిపిస్తున్న పుచ్చకాయ పంట

- 90 రోజుల్లోనే పంటచేతికి - పెట్టుబడి తక్కువ - రూ.2లక్షల వరకు ఆదాయం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



రైతులకు పుచ్చకాయ (వాటర్ మిలాన్) పంట సిరులు కురిపిస్తోంది. 90 రోజుల్లోనే పంట చేతికి రావడం వల్ల మంచి లాభాలు వస్తున్నాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నల్లగా నిగనిగలాడే పుచ్చకాయలు ఆరోగ్యానికి మం చివి అంటారు. ఎర్రటి రంగు కలిగి నల్లటి గింజలతో చూడగానే నోరూరించే పుచ్చపండు అంటే ఇష్టపడని వారు ఎవరూ ఉండరు. వేసవి వచ్చిందటే దీనికి ఉండే డిమాండే వేరు. సామాన్యులు సైతం కొనుక్కోగలిగే ధరల్లో ఇవి మనకు లభిస్తాయి. వేసవికాలం వచ్చిందంటే చాలు ప్రజలు తమ దాహం తీర్చుకోవ డానికి పలు రకాల ప్రయత్నాలు చేస్తుంటారు. అందులో భాగంగానే మనకు కాలానుగుణంగా వచ్చే పుచ్చకాయలు వేసవికాలంలో చాలానే దొరుకుతాయి. ఈ పంటను పండించడానికి 90 రోజుల గడువు తీసుకుని మార్కెట్లోకి వస్తాయి. రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను గడిస్తారు. లింగాల మండ లంలో అత్యధికంగా సాగు చేశారు. ఈ పంటకు తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభాలను పొందుతూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. మొత్తం 90 రోజుల వ్యవధిలోనే చేతికి వచ్చి లాభాలను ఇస్తుందని.. దీంతో తమకు చేతి నిం డా పనిదొరుకు తున్నదన్నారు. ఎకరాకు విత్తనాలకు రూ.20 వేలు ఖర్చు కాగా, మరో రూ.20వేలు మందులకు, కూలీల కు కలిపి మొత్తం రూ.60వేలు ఖర్చు పెట్టి పంట తీస్తారు. కానీ పంట చేతికి వచ్చినప్పటినుంచి మూడు సార్లు తెంపు తారు (కోత). వాటితో రాబడి మొత్తం దాదాపుగా రూ.2లక్షల దాకా వస్తుంది.

లాభాలు బాగా వస్తున్నాయి..

నేను పూర్తిగా వ్యవసాయం పైనే ఆధారపడి ఉన్నా. మాకు ఉన్న పొలంలో మూడు ఎకరాలు ప్రస్తుతం పుచ్చకాయ పంట వేశాను. ఈ విత్తనం వేసిన దగ్గర నుంచి పంట చేతికి వచ్చే వరకు కూడా చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. నేను మాత్రం వీటి ద్వారా అధిక లాభాలనే పొందుతున్నాను. రూ.12 నుంచి రూ.16 కిలో లెక్క అమ్ముతాము.

- ఎర్ర మేకల ఈశ్వరుడు, రైతు

తక్కువ రోజుల్లో పంట చేతికి వస్తుంది

పుచ్చకాయ పంట 90 రోజుల్లోనే చేతికి వస్తుంది. ఖర్చు చాలా తక్కువగా అవుతుంది. ఆదాయం బాగా ఉంటుంది. ఈ ఏడాది తెగుళ్ల లేకపోవడంతో పంట ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం ధర కిలో రూ.15 ఉండడంతో మంచి లాభాలు వచ్చే అవకాశం ఉంది.**- వెంకటరమణారెడ్డి, రైతు**

పేద విద్యార్థుల శ్రేయస్సే ప్రధాన లక్ష్యం

- గ్రంథాలయ చైర్‌పర్సన్ మధుబాల

ప్రజాశక్తి-కలికిరి



డిఎస్‌సి అభ్యర్థులకు పుస్తకాలను అందిస్తున్న మధుబాల

పేద విద్యార్థుల శ్రేయస్సు లక్ష్యంగా ఉచితంగా డిఎస్‌సి పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు చిత్తూరు జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ నైనారు మధుబాల తెలిపారు. స్థానిక గ్రంథాలయం అధికారి విజయకుమార్ అధ్యక్షతన ఆదివారం జరిగిన కార్యక్రమంలో డిఎస్‌సి అభ్యర్థులకు ఉచిత పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిఎస్‌సికి ప్రస్తుతం ఉన్న సమయం చాలా తక్కువని గ్రామీణ ప్రాంత విద్యార్థులు కోచింగ్ తీసుకునే సమయం లేక అందుబాటులో పుస్తకాలు లేక ఇబ్బంది పడుతున్నారని గుర్తించి జిల్లా వ్యాప్తంగా కుట్టి డిఎస్‌సి కోచింగ్ వారిని సంప్రదించి వారి సహకారంతో జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రంథాలయాలలో ఈ కార్యక్రమం జరిగేలా చర్యలు తీసుకోవడం జరిందన్నారు. కుట్టి డిఎస్‌సి కోచింసెంటర్ యాజమాన్యం రామకృష్ణ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తం గా అన్ని గ్రంధాల యాలలో 500 మంది అభ్యర్థులకు ఉచిత పుస్తకాలను తన సొంత నిధులతో అందిస్తున్నట్లు తెలిపారు. ముస్లిం మైనారిటీ విద్యార్థులకు చిత్తూరులో తమ కోచింగ్ సెంటర్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డిఎస్‌సి అభ్యర్థులు పాల్గొన్నారు.

లఘు చిత్రాలకు టిఎస్ఎఫ్ఎ పురస్కారాలు



ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటుడు పురస్కారాలు అందుకున్న పోరాటం యూనిట్

ప్రజాశక్తి-పీలేరు

2022-23 సంవత్సరంలో నిర్మించిన లఘు చిత్రాలకు ప్రకటించిన పురస్కారాల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి రెండు లఘు చిత్రాలు పురస్కారాలను అందుకున్నాయి. హైదరాబాద్ లో కళారాజ్ మీడియా, ఎంటర్టైన్మెంట్ శనివారం రాత్రి నిర్వహించిన టిఎస్ఎఫ్ఎ (తెలుగు షార్ట్ ఫిల్మ్స్ అవార్డ్స్)లో పీలేరు ఎంజెఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యార్థులు రామ్ చరణ్, చాణిక్యలు చిత్రీకరించిన చిట్టి ప్రేమ లఘు చిత్రం టిఎస్ఎఫ్ఎ పురస్కారాన్ని అందుకుంది. తిరుపతికి చెందిన మురళి కొడగంటి స్వీయ రచన, దర్శకత్వంలో చిత్రీకరించిన పోరాటం అనే ఇండిపెండెంట్ ఫిల్మ్‌కి బెస్ట్ డైరెక్టర్ అవార్డు, అదే చిత్రంలో ఓ జర్నలిస్టు పాత్రలో నటించిన పండ్లూరు వెంకటేష్ బెస్ట్‌యాక్టర్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని పలువురు యూట్యూబర్‌లు, కళాకారులు అభినందించారు.

జనసేనలో 50 మంది యువత చేరిక

ప్రజాశక్తి-మదనపల్లి



పార్టీలో చేరిన యువతను అభినందిస్తున్న రాందాస్ చౌదరి

స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో గంగారపు రామదాస్ చౌదరి ఆధ్వర్యంలో యువ నాయకులు షేక్ ఫాజీల్, ఆయన మిత్రుడు షారుఖ్ అధ్యక్షతన 50 మంది యువత జనసేన పార్టీ లోచేరినట్లు జనసేన రాయలసీమ కో-కన్వీనర్ రామదాస్‌చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన, టిడిపి ఉమ్మడి కార్యాచరణకు ఆకర్షతులైన యువత పార్టీలో చేరడం చాలా సంతోషదాయకం అన్నారు. ఎన్నికల్లో కచ్చితంగా జనసేన,టిడిపి ఉమ్మడి అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని చెప్పారు. త్వరలో అభ్యర్థి ఖరారు తరువాత పూర్తిస్థాయిలో రామదాస్ అధ్వర్యంలో ఉమ్మడి అభ్యర్థి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని యువకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీ లు సనా ఉల్లా, గజ్జల రెడ్డెప్ప, రూరల్ మండలం అధ్యక్షులు గ్రానైట్ బాబు,రూరల్ ప్రధాన కార్యదర్శి పవన్ శంకర, విజయ్ కుమార్, గంగులప్ప, మజ్యాల నవీన్ రాయల్, నారాయణ స్వామి, నరేష్,యాసిన్,ప్రవీణ్, మహేష్, హరీష్,సికందర్, రెడ్డి, సిద్దిక్, ఆఫ్రోజ్,తౌసిఫ్ పాల్గొన్నారు.

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు



స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండలంలోని కోసవారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకట రమణస్వామి ఆలయంలో పది రోజులుగా వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు.టీటీడీ ఆధ్వర్యంలో వార్షిక బ్రహ్మోత్సవాలను ఉప ప్రధాన అర్చకులు కృష్ణ ప్రసాద్ భట్టార్ , అర్చకులు రమేష్ బాబులు, శ్రీనివాసుని ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం రాత్రి గజారోహణం నిర్వహించారు. సాంప్రదాయబద్ధం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందిం చారు. టిటిడి ధర్మ ప్రధాన పరిషత్ ఆధ్వర్యంలో రాత్రి హరికథ, పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులను అలరింప చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ వరలక్ష్మి, ఎఇఒ గోపీనాథ్, ఇన్స్‌పెక్టర్ దీక్షిత్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళల సాధికారత కాంగ్రెస్‌తోనే సాధ్యం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

మహిళ సాధికారత కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అవుతుందనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహిళలు అందరూ కాంగ్రెస్ వైపు చూస్తున్నారని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. కడపకు చెందిన శ్యామలమ్మను రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలిగా, వేముల నాగరత్నను మహిళ కాంగ్రెస్ నగర అధ్యక్షురాలిగా, మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు తాతియాను నియమించారు. ఈ నేపథ్యంలో వేంపల్లెలో ఆదివారం పదవులు పొందిన శామలమ్మ, నాగరత్నకు తులసిరెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు రాజకీయ, సాంఘిక, ఆర్థిక సాధికారత కోసం కాంగ్రెస్ ఎంతో చేసిందన్నారు. బాలింతలకు, గర్భిణులు, బాలబాలికల్లో పౌష్టికాహార లోప నివారణ కోసం 1975లోనే అంగన్వాడీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మహిళా ఆర్థిక స్వావలంబన కోసం డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి పావలా వడ్డీ, సున్నా వడ్డీ, స్త్రీ నిధి పథకాలను ప్రవేశ పెట్టి మహిళాలను మహారాజులుగా చేసిందని వివరించారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించి లక్షలాది మంది మంది మహిళలను రాజకీయ పదవులైన సర్పంచులు, ఛైర్మన్లుగా, మేయర్లుగా చేసిందని చెప్పారు. కాంగ్రెసు ప్రభుత్వం అధికారంలోకి వస్తే బంగారుతల్లి, అమ్మ హస్తం పథకాలను పునరుద్ధరణ చేస్తామని తులసిరెడ్డి పేర్కొన్నారు. ధరలు కూడా తగ్గిస్తామన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాకోసం, రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రజలు కాంగ్రెస్‌కు అండగా నిలవాలని కోరారు. రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి అయితే రాష్ట్ర అభివృద్ధి చెందుతుందన్నారు. నియామక పత్రాలు అందుకున్న మహిళలు తులసిరెడ్డిని సత్కరించారు.

జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి- మదనపల్లి

జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్ ఆధ్వర్యంలో పార్టీ పట్టణంలోని ఎంజి గ్రౌండ్ సమీపంలో ఆదివారం పార్టీ కార్యాలయాన్ని తంబళ్లపల్లి, పుంగనూరు, పీలేరు, రాయచోటి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తల సమక్షంలో ప్రారంభించారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనసేన పార్టీ పుంగనూరు ఇన్‌ఛార్జి చిన్న రాయల్, రాయచోటి ఇన్‌ఛార్జి పటాన్, నాయకులు నరేష్, చైతన్య, కుప్పం ఇన్‌ఛార్జి ఆదిత్య, నరేష్ చిత్తూరు జిల్లా నాయకులు కలప రవి, మోహన్ ప్రదీప్, కరుణాకర్ ,టిడిపి నాయకులు పట్టణ అధ్యక్షులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ భవాని ప్రసాద్ టీడీపి రాజంపేట అధికార ప్రతినిధి ఆర్‌జె వెంకటేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని పురవీధుల గుండా జనసేన పార్టీ నాయకులు 200 బైకులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మైఫోర్స్ మహేష్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో జనసేన టిడిపి ఉమ్మడి అభ్యర్థులు గెలుపుకి కృషి చేస్తామని పేర్కొన్నారు. జనసేన, టిడిపి కార్యకర్తలకు జనసేన పార్టీ కార్యాలయం అందుబాటులో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో జనసేన పార్టీ చిత్తూరు జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు అమర్ నారాయణ, మహిళా నాయకులు శోభా సునీత, నగీన, పార్టీ నాయకులు తోట కళ్యాణ్, ఆసి, మంజు, పతి, రతీష్, చిరంజీవి, సందీప్ రెడ్డి,అయాజ్, జాఫర్, సికిందర్ పాల్గొన్నారు.



సమరభేరి పోస్టర్‌న ఆవిష్కరిస్తున్న నాయకులు

మదనపల్లి జిల్లా సాధన కోసం సమరభేరి

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లి జిల్లా సాధనకై మరో పోరాటానికి సిద్ధమైనట్లు బహుజన రాష్ట్ర అధ్యక్షులు చందు తెలిపారు. మదనపల్లి జిల్లా సాధనకై ఆదివారం సమరభేరి నిర్వహించి పెద్ద ఎత్తున ఐక్యత ర్యాలీని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మదనపల్లి జిల్లా సాధనకై అన్ని రాజకీయ పక్షాలను, అన్ని వర్గాల ప్రజలను ప్రజాసంఘాలను కలిసి పెద్ద ఎత్తున ర్యాలీ విజయవంతానికి కృషి చేస్తున్నామన్నారు. జిల్లా సాధనకై సమరభేరి, సకల జనుల ఐక్యత ర్యాలీని జయప్రదం చేయాలన్నారు.తంబళ్లపల్లె, పీలేరు, పుంగునూరు, మదనపల్లెను కలిపి జిల్లాగా ఏర్పాటు చేసుకుందా మన్నారు. జాతీయ గీతాన్ని అందించిన రవీంద్రనాథ్ ఠాగూర్ మన మదనపల్లి నుండే తన గొంతును వినిపించారన్నారు. కార్మిక కర్షక, రైతులందరూ పాల్గొనాలని పిలపునిచ్చారు. అనంతరం మిషన్ కాంపౌండ్ గ్రౌండ్‌లో మదనపల్లి జిల్లా సమరభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బహుజనసేన రాష్ట్ర కార్యదర్శి కొండుపల్లి ఆనంద్, ఆటో యూనియన్ నాయకులు రాఘవేంద్ర యాదవ్, గురు, అన్నమయ్య జిల్లా సెక్రటరీ రూపక్‌నాయక్, ఎస్‌టి నాయకులు నవీన్‌నాయక్, నరేష్, వెంకీ, వంశీ, దేవా, గంగాధర్, భాను, రెడ్డి, అబూ, నూర్, అభి,జెన్నిత్, రాజేష్ పాల్గొన్నారు.



యల్లటూరు సోదరులను సన్మానిస్తున్న ఐటి కో-ఆర్డినేటర్లు

శ్రీనివాసరాజును కలిసిన ఎంస్‌పి ఐటి కో-ఆర్డినేటర్లు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలోని స్థానిక యల్లటూరు భవన్‌లో ఆదివారం యల్లటూరు శ్రీనివాసరాజును జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా ఐటి కో-ఆర్డినేటర్లు మర్యాదపూర్వకంగా కలిసి యల్లటూరు సోదరులను శాలువాలతో సన్మానించారు. రాజంపేట జనసేన పార్టీకి సాంకేతికంగా తమ పూర్తి మద్దతు ఉంటుందని, ప్రతి మండల కేంద్రంలో ఉన్న ఐటీ కోఆర్డినేటర్లను కలుపుకొని పార్టీకి సంపూర్ణంగా సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి కడప జిల్లా ఐటీ కోఆర్డినేటర్ యాపరాల వెంకటేష్, మైదుకూరు కోఆర్డినేటర్ భూమిరెడ్డి సిద్ధాంత్, రాయచోటి కో-ఆర్డినేటర్ నీలకంఠం సుధీర్, జమ్మలమడుగు కో-ఆర్డినేటర్ దిలీపరాజు, మాజీ జడ్‌టిసి శివరామరాజు, రాజంపేట ఐటి సభ్యులు ప్రశాంత్ భారతాల, జనసేన నాయకులు కోలాటం హరికృష్ణ, ముత్యాల చలపతి, పాల్గొన్నారు.

రైతుల త్యాగాల వాస్తవ రూపమే రాజధాని ఫైల్స్ :'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్ర అభివృద్ధిని కోరే 35వేల మంది రైతుల త్యాగాల వాస్తవ ఫలితమే రాజధాని ఫైల్స్ చిత్రం అని రాజంపేట టిడిపి పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు తెలిపారు. రైతుల కన్నీటిని తుడుస్తూ సమాజాన్ని చైతన్యపరిచే సామాజిక బాధ్యతతో కూడిన సినిమా కాబట్టే రెండు రోజులపాటు రాజంపేట పరిసర ప్రాంత ప్రజలు వీక్షించాలనే భావనతో రాజధాని ఫైల్స్ ఉచిత షోలు ప్రదర్శించినట్లు తెలిపారు. ఆదివారం టిడిపి నాయకులతో కలిసి సుదర్శన్ థియేటర్ లో రాజధాని ఫైల్స్ చిత్రాన్ని వీక్షించారు.సమాజాన్ని చైతన్యపరిచే సినిమా రాజధాని ఫైల్స్ అని, సామాజిక బాధ్యతతో వాస్తవాలను సినిమాగా తీస్తే తప్పు ఎలా అవుతుందో చెప్పాలన్నారు. సినిమాలో ఎటువంటి కించపరిచే సన్నివేశాలు కూడా లేవన్నారు. కేవలం రైతుల ఆవేదనలు మాత్రమే చూపించే ప్రయత్నం చేశారని, దానికే ముఖ్యమంత్రి భయపడుతున్నారని అన్నారు. రాజధాని ఫైల్స్ సినిమా ప్రజలు చూస్తే ఎక్కడ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ప్రజలు ఛీ కొడతారో అని, కోర్టుల ద్వారా సినిమాను ఆపే ప్రయత్నం చేశారే కానీ జగన్ రెడ్డిపై ప్రజల్లో వచ్చిన వ్యతిరేకతను ఆపగలరా అని అన్నారు. కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వూరు సుబ్రహ్మణ్యం నాయుడు, మండల పార్టీ ఉపాధ్యక్షులు సతీష్ రాజు, సీనియర్ నాయకులు జి.వి సుబ్బరాజు, యువ నాయకులు ఒంటిమిట్ట హరినాథ్ రెడ్డి, కుమారి శివారెడ్డి, బొడిచర్ల శ్రీనివాసులు, మైనారిటీ నాయకులు రంతూ, కిషోర్ రెడ్డి, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు వెంకటరమణ పాల్గొన్నారు.



షుగర్ వ్యాధిగ్రస్తులను పరీక్షిస్తున్న డాక్టర్ పుల్లారెడ్డి

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రం గాలివీడులోని స్థానిక వెంకటేశ్వర ఆస్పత్రిలో ఆదివారం డాక్టర్ మిట్టపల్లి పుల్లారెడ్డి షుగర్ వైద్య నిపుణుల ఆధ్వర్యంలో ఉచిత షుగర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి 260 మందికి ఉచితంగా రక్త పరీక్షలు చేసి మందులు కూడా పంపిణీ చేసినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా ప్రతి మూడు మాసాలకు ఒకసారి షుగర్ వైద్య శిబిరం కూడా నిర్వహించడానికి చర్యలు తీసుకుంటమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయ్‌కుమార్, మహేంద్రబాబు, రాహిల్‌బాషా, వెంకటేష్, ప్రసాద్, అక్రమ్, శిరీష, లక్ష్మి, కృష్ణవేణి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి : సిఐ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు వాహనదారులు, దుకాణదారులు, ప్రజలు సహకరించాలని బి.కొత్తకోట సిఐ యన్.సూర్య నారాయణ పిలుపునిచ్చారు.పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో ఆదివారం జ్యోతి బస్టాండ్ వద్ద రోడ్డుకు ఇరువైపులా పోలీస్ సిబ్బంది చేత మార్జిన్ లైన్స్ వేయించారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పట్టణ ప్రజలు మార్జిన్ లైన్ లోపలనే వాహనాలు నిలపాలన్నారు. రోడ్డుపైన వున్న తోపుడు బండ్లు, కూరగాయల అంగళ్ళు వారు బస్టాండుకు దూరంగా పెట్టుకోవాలని సూచించారు. దుకాణాల యజమానులు కూడా వారి షాపుల ముందర వాహనాలు నిలుపుతున్నప్పుడు వారికి మార్జిన్ లోపల పెట్టమని తెలియజేయాలన్నారు. దుకాణదారులు తమ వస్తువులను రోడ్డుపై పెట్టకుండా వారివారి దుకాణంలోనే పెట్టుకోవాలని , ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు.ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడప కూడదని, అలా నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. తల్లిదండ్రులు మైనర్‌లకు వాహనాలు ఇవ్వకూడాదని అలా చేస్తే తల్లిదండ్రులపై కూడా చర్యలు తీసుకోవాల్సి వస్తోందన్నారు. పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నియమాలు పాటించి పోలీసులకు సహకరించాలని సిఐ కోరారు.